
సాక్షి
కాకినాడ
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శ్రీలక్ష్మీకృతి కలగ(సికింద్రాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం అందజేశారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం 3,61,255 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 11,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

5న సామర్లకోటకు సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 5వ తేదీన సామర్లకోట రానున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు.

- 8లో▸

న్యూస్‌రీల్

రేపటి స్పందన రద్దు

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం గాంధీ జయంతి నేపథ్యంలో రద్దయింది. కలెక్టర్ కృతికా శుక్లా శనివారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది భక్తులు



సత్యదేవుని ఆలయం వద్ద క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. వందలాది వాహనాల్లో భక్తులు సత్యదేవుని దర్శనానికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు అధికారులు తెలిపారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతుల వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దేవస్థానంలో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఆలయ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



సత్యదేవుని సన్నిధిలో నరసింహరావుకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) పోలీసులను ఎస్‌పీఎఫ్ రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు సూచించారు. శనివారం ఆయన రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం సత్యదేవుని ఆలయం వద్ద ఎస్‌పీఎఫ్ సిబ్బంది విధుల నిర్వహణపై చర్చించారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది హాజరు పట్టీ, రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్‌పీఎఫ్ ఇనస్పెక్టర్ శ్రీధర్ ఉన్నారు.

మరో 275 సెల్‌ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్‌ను అందుకుంటూ పోలీసుల కృషిని అభినందిస్తున్న సీనియర్ సిటిజన్

కాకినాడ క్రైం: దొంగతనాలకు గురైన, పోగొట్టుకున్న 275 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి యజమానులకు అప్పగించారు. ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్ వినియోగం సత్ఫలితాలను ఇస్తోందని చెప్పారు. తాజాగా క్రైం బృందాల కృషితో రూ.55 లక్షలు విలువైన 275 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. మొబీ ట్రాక్ సేవలు పొందాలంటే 94906 17852 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అనే సందేశం పంపాలని ఎస్పీ తెలిపారు.

నాడు రోత.. నేడు మోతా?

- నాటి కాపు ఉద్యమంలో కంచాలు కొట్టిన వారిపై వేధింపులు
- సెక్షన్ 341 కింద కేసులు పెట్టిన చంద్రబాబు సర్కార్
- ఇప్పుడు కంచాల మోతకు లోకేష్ పిలుపుపై విమర్శలు
- టీడీపీ ద్వంద్వనీతిపై సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నట్టు తెలుగుదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. వందల కోట్ల రూపాయల స్కిల్ స్కామ్‌లో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో టీడీపీ అధినేత చంద్రబాబు 21 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైలులో ఉన్న చంద్రబాబుకు సంఘీభావంగా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించాలంటూ లోకేష్ ఇచ్చిన పిలుపు నగుబాటుకు గురవుతోంది. శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఐదు నిమిషాలు పాటు కంచాలు, గరిటెలు, వాహనాల హారన్‌లు, అవేవీ అందుబాటులో లేకపోతే విజిల్స్‌తోనైనా 'ప్రజాశబ్దం' చేయాలని చేసిన ట్వీట్ ఉమ్మడిగోదావరి జిల్లాల్లో చర్చనీయాంశమైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో మరోలా ప్రవర్తించడం టీడీపీ నేతలకు పరిపాటని పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు.

తమ పార్టీ అధినేత కటకటాలపాలై దిక్కుతోచక తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గోదావరి జిల్లాలు బలమైనవిగా భావించే పరిస్థితులు టీడీపీకి ఉండేవి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ జనరంజక పాలనతో ఉనికి కోసం తంటాలుపడుతోంది. చంద్రబాబు జైలులో ఉన్నా జిల్లా ప్రజల సంగతి అటుంచితే పార్టీ నేతల కనీస స్పందన కూడా కొరవడిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గగ్గోలు పెట్టడం బహిరంగ రహస్యమే.

ఇదేం వైఖరి

చంద్రబాబు తరహాలోనే ఆ పార్టీ నేతలు రెండు నాలుకల ధోరణి అనుసరిస్తున్నారు. తాము చేస్తే ఒప్పు ఇతరులు చేస్తే తప్పు అనే టీడీపీ నేతల తీరును ప్రజలు గ్రహిస్తున్నారు. 2016లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కాపు ఉద్యమం ప్రధానంగా నాటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉధృతంగా సాగింది. ఆ క్రమంలో జనవరి 31న తుని రైలు దహనం సంఘటన జరిగింది. ఆనాటి సర్కారే తెరవెనుక నడిపిన మంత్రాంగం వల్లే ఈ సంఘటన జరిగిందనే ఆరోపణలు అప్పట్లోనే వినిపించాయి. ముద్రగడ పద్మనాభం **సహా ఆ కుటుంబంలోని మహిళలని కూడా చూడకుండా టీడీపీ సర్కార్ దమనకాండకు పాల్పడింది. దీనిపై కాపు సామాజిక వర్గీయులు శాంతియుత పంథాలో బాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తం** చేశారు. ఇళ్ల వద్దనే కంచాలు, పళ్లాలు, ప్లేటులను గరిటెలతో దరువు వేస్తూ 'కాపుల ఆకలి కేకలు' అంటూ నినదించారు. శాంతియుతంగా ఇళ్లవద్ద, రోడ్డుకు ఇరువైపులా కూర్చుని కంచాలపై దరువువేసిన వారిపై కేసులు బనాయించింది. మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా అందరిపైనా సెక్షన్ 341 కింద కేసులు పెట్టింది. సుమారు 400 కేసులు పెట్టింది.



నాడు కాపు ఉద్యమంలో భాగంగా అమలాపురంలో కంచాలు కొడుతున్న నేతలు (ఫైల్)

కేసులు ఎత్తివేసిన జగన్

అక్రమ కేసులు ఎత్తేయాలని సామాజికవర్గ నేతలు, యువత వేడుకున్నా చంద్రబాబు సర్కార్ మనసు కరగలేదు. చివరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనసు చాటుకున్నారు. గత పాలనలో కాపు ఉద్యమ సందర్భంలో పెట్టిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తేశారు. నాడు ఉద్యమంలో భాగంగా కంచాలపై శబ్దాలుచేస్తేనే అక్రమ కేసులు పెట్టి ఇప్పుడు చంద్రబాబుకు మద్దతుగా అదే తరహాలో చేయమని లోకేష్ ట్వీట్ చేయడం సిగ్గుచేటని వివిధ పక్షాలు ఆక్షేపిస్తున్నాయి. అప్పుడు ఆ సామాజికవర్గం న్యాయమైన డిమాండ్ కోసం చేస్తే అక్రమ కేసులతో వేధించి ఇప్పుడు అదే పద్ధతిలో చంద్రబాబుకు సంఘీభావం తెలియచేయమనడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమంటున్నారు.

వేధించిన వారే కంచాలు కొట్టమంటే ఎలా?



శాంతియుతంగా కంచం శబ్దాలు చేస్తూ ఆందోళన చేస్తే చంద్రబాబు ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టింది. మహిళలని కూడా చూడకుండా వేధించింది. ఎవరి ఇంటి వద్ద వారు కంచాలతో చప్పుడు చేస్తే పెద్ద నేరం చేసినట్టు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పింది. ఇప్పుడు అవినీతి కేసులో జైలులో ఉన్న చంద్రబాబు కోసం కంచాలతో దరువు వేయాలని లోకేష్ పిలుపు ఇవ్వడం సిగ్గుచేటు.

– అద్దగర్ల వరలక్ష్మి, పి.గన్నవరం

నాడు ఉక్కుపాదం



కాపు ఉద్యమంపై నాడు ఉక్కుపాదం మోపడమే కాకుండా చంద్రబాబు ప్రభుత్వం ఏడెనిమిది నెలల పాటు పోలీసులను ఉసిగొల్పి వేధించింది. ఉద్యమ నాయకుడు ముద్రగడ కుటుంబంలోని మహిళలను అన్యాయంగా దుర్భాషలాడుతూ ఈడ్చుకుపోయారు. న్యాయమైన డిమాండ్‌తో నిరసన తెలిపితే కేసులు పెట్టిన చంద్రబాబుకు ప్రజలు ఎలా సంఘీభావం తెలుపుతారు?

– దలే చిట్టిబాబు, బోర్డు మెంబర్, అన్నవరం దేవస్థానం

లోకేష్ పిలుపు విస్మయంగా ఉంది



ఎవరింటి వద్ద వారు పిల్లాపాపలతో కంచాలు, ప్లేట్లపై చప్పుడు చేస్తే నాడు కేసులు పెట్టారు. ఇళ్లకు వచ్చి పోలీసులు చాలా ఇబ్బందులకు గురి చేశారు. నేడు వందల కోట్ల రూపాయల అవినీతి కేసులో చంద్రబాబు జైలులో ఉన్నారు. ఇప్పుడు కంచాలు కొట్టండని లోకేష్ కోరడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని అక్రమ కేసులు ఎత్తివేసి మేలు చేశారు.

– సూదా గణపతి, అమలాపురం

ప్రజారోగ్యానికి ప్రభుత్వం భద్రత

- పి.వెంకటాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభించిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే
- నవంబరు 20 వరకూ శిబిరాలు కొనసాగింపు
- వైద్య పరీక్షలతోపాటు మందులూ ఉచితం



శిబిరంలో మందులు పరిశీలిస్తున్న కలెక్టరు కృతికా శుక్లా, ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు



చామవరంలో వృద్ధురాలికి సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కాకినాడ రూరల్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కింద నవంబరు 20 వరకు 433వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు కలెక్టరు కృతికా శుక్లా తెలిపారు. కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఆరోగ్య అధికారులతో కలిసి జిల్లా స్థాయిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనిక్, పీడియాట్రిక్ వైద్య విభాగాలతోపాటు రిజిస్ట్రేషన్స్, డేటా ఎంట్రీ, ఆరోగ్య శ్రీ రిఫరల్, బ్లడ్ టెస్ట్, బీపీ, షుగర్ పరీక్షలు, ఫార్మసీ, న్యూట్రిషన్ కౌన్సెలింగ్‌లను కలెక్టరు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం వైద్య సేవలను పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి వివరాలతో కూడిన బుక్ లెట్.. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు అధ్యతన జరిగిన సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ఐదు దశల్లో జరుగుతుందన్నారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఆశాలు చేసిన ఇంటింటి సర్వే ఆధారంగా వైద్య శిబిరంలో వైద్య సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. ఏడు రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాలు మందులు అందిస్తామన్నారు. స్పెషలిస్టు వైద్యులు శిబిరాలలో పాల్గొంటారన్నారు. వైద్య సేవలతో పాటు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ఇది వినూత్నం

ఎంపీ వంగా గీత మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. అందుకే గతంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ.., 108 వంటి పథకాల ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే బాటలో వెళ్తున్నారన్నారు. విద్యతో పాటు పేద వైద్యానికి పెద్ద పీట వేస్తూ ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యజ్ఞంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప కార్యక్రమన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏ రకమైన వైద్య సేవలు అవసరమో గుర్తిస్తున్నారన్నారు. ఆమేరకు వైద్య శిబిరాల ద్వారా స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం ఆరోగ్య శ్రీ ద్వారా ఆస్పత్రుల్లో అందజేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యక్రమాలు చేస్తూ పథకాలు అందిస్తున్నారన్నారు. జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, జెడ్పీటీసీ సురుకుర్తి రామకృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ పెంకే సోమరాజు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, డీఎం అండ్ హెచ్ఓ డాక్టరు జె.నరసింహ నాయక్, ఆరోగ్య శ్రీ సమన్వయ కర్త డాక్టరు పి.రాధాకృష్ణ, డీఐఓ రత్నకుమార్, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, గోపుశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం సీఎం జగన్ లక్ష్యం

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించిన మంత్రి రాజా

తుని రూరల్: రాష్ట్రంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. చామవరంలో శిబిరాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే ఇంటింటా తిరిగిన వైద్య సిబ్బంది రోగులను గుర్తించారన్నారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులలో పూర్తిస్థాయి వైద్యం అందిచనున్నట్టు వెల్లడించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఏడు రకాల వైద్య సేవలను ఇళ్ల వద్దే అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించి, అభినందించారు. శిబిరంలో అందిస్తున్న సేవలను తేటగుంట పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కె.అన్వేషి వివరించారు. పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు, సీజేఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ, సీనియర్ నాయకుడు పోతల రమణ, ఎంపీడీఓ పి.రవికుమార్, తహసీల్దార్ ఎల్.శివకుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వైట్ కోటు వేడుక



వైద్య విద్యార్థి పవన్‌కు తెల్లకోటు ధరింపజేసిన డీఎంఈ డాక్టర్ నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోని ఫిజియాలజీ హాల్‌లో శనివారం వైట్ కోటు వేడుక నిర్వహించారు. రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థిగా కాంపస్ సహా సమాజంలో పాటించవలసిన హుందాతనాన్ని వివరించారు. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, వైట్ కోట్ సెర్మనీని 1993లో ఆర్నాల్డ్ గోల్డ్ తొలిసారి కొలంబియాలో ప్రారంభించారన్నారు. తెల్లకోటు వృత్తి పరమైన ఔన్నత్యానికి, నమ్మకం, భరోసాకి గుర్తని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సహా ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ దేవీ మాధవి తదితరులు పాల్గొన్నారు. 249 మంది నూతనంగా ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులు తెల్లకోటు ధరించారు.

వైఎస్సార్ సీపీ న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వెంకటాచలం



కాకినాడ: వైఎస్సార్ సీపీ న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కందుల వెంకటాచలం నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధిష్టానం ఈ నియామకాన్ని చేపట్టింది. పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన వెంకటాచలం పార్టీలో సీనియర్ నాయకుడు.

ఎమ్మెల్యేను కలసిన జీజీహెచ్ సూపరింటెండెంట్



చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాథ్‌ల్యాబ్ మంజూరులో కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి మరింత సహకరించాలని కోరారు. పేద నిరుపేద రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో రాజీ పడవద్దని ఎమ్మెల్యే ఆమెకు సూచించారు. తమ వంతు బాధ్యతగా ప్రభుత్వం నుంచి ఏదైనా చేస్తానని అన్నారు. ఆమె వెంట ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ ఉన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో వాహన మిత్ర లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. మండలంలో 454 మంది వాహన మిత్ర లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.45.40 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆటోవాలాలు సీఎం జగన్, ఎమ్మెల్యే పర్వత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఓరుగంటి వెంకన్న, పెనుమర్తుల నాని, షేక్ చిన్నారావు, దేశెట్టి దుర్గాప్రసాద్, జిగటారపు రాజు, సుంకర గణపతి, షేక్ గంగ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

జగ్గంపేట: వైఎస్సార్ వాహన మిత్ర పథకం లబ్ధిదారులు శనివారం జగ్గంపేటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఆటో యూనియన్ అధ్యక్షుడు కిలపర్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఒమ్మంగిలో సీఎం జగన్, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆటోవాలాలు

వాహన మిత్ర అమలుపై హర్షం

తొండంగి: వాహన మిత్ర పథకం ద్వారా ఆటోవాలాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో ఐదో విడత వాహన మిత్ర సొమ్ములు జమకావడంతో హర్షం వ్యక్తం చేశారు. శనివారం తొండంగిలో ఆటో డ్రైవర్లు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


ప్రమాదంలో నుజ్జయిన కారు

రాజానగరం: అసలే మద్యం మత్తులో ఉన్నారు.. ఆపై అతి వేగం.. రాంగ్ రూటులో ప్రయాణం.. ఫలితంగా ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. జాతీయ రహదారిపై స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తుని మండలం హంసవరానికి చెందిన సాపశెట్టి గణేష్ (29), రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన ఉడత సాయి (22) బైక్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. ఏడీబీ రోడ్డు నుంచి వారు జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోకి మళ్లాల్సి ఉంది. కానీ మద్యం మత్తులో ఉన్న వారికి ఏది ఏ రూటో తెలియలేదో ఏమో! రాంగ్ రూటులో రాజమహేంద్రవరం నుంచి వచ్చే రోడ్డు పైకి బైకును పోనిచ్చారు. ఈ క్రమంలో డివైడర్‌ను ఆనుకుని కొద్ది దూరం వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న కారు.. వారిని తప్పించబోయి, ఢీకొని రోడ్డుకు అడ్డంగా దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్ బోల్తా పడింది. బైక్ నడుపుతున్న గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రాజానగరం పోలీసులు తెలిపారు.

హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ పి.జగదీశ్ తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను అధికారులకు వివరించారు. రాజానగరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. ఇలాగే జిల్లాలో పలుచోట్ల హైవేపై జరుగుతున్న ప్రమాదాల్లో చాలామంది నిత్యం మృత్యువాత పడుతున్నారని ఎస్పీ గమనించారు. రాజానగరం వద్ద హైవేపై ప్రమాద ప్రదేశాన్ని సందర్శించి, ఇక్కడి లోపాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ, జాతీయ రహదారిపై రోజూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, మరికొందరు గాయపడుతున్నారని అన్నారు. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి నేషనల్ హైవే అథారిటీతో సంప్రదించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ హెచ్చరిక బోర్డులు పెంచాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు. కార్యక్రజుమంలో డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్, బొమ్మూరు సీఐ ఆర్.విజయ్ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

5న సామర్లకోటకు సీఎం జగన్


విలేకర్లతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- జగనన్న లే అవుట్ ఇళ్లు ప్రారంభం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు వెల్లడి

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 5వ తేదీన సామర్లకోట రానున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, పార్కులను ప్రారంభిస్తారని తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులతో ముచ్చటిస్తారని అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దొరబాబు మాట్లాడారు. విజయవాడ నుంచి సామర్లకోట – పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సమీపాన ప్రైవేటు లే అవుట్‌లో ఏర్పాటు చేసే హెలిపాడ్‌కు చేరుకునే సీఎం జగన్.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జగనన్న కాలనీకి చేరుకుంటారని వివరించారు. జగనన్న కాలనీ సందర్శన అనంతరం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సామర్లకోట వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దొరబాబు పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో 15 రోజుల్లో ఇంటింటా జగనే కావాలి కార్యక్రమం ప్రారంభమవుతుందని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ, సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పి.సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ పాల్గొన్నారు.

సత్యదేవుని భక్తులకు

- కార్తికం నాటికి అందుబాటులోకి..
- ఆలయం చుట్టూ ఒకే ఎత్తున ఆవరణ
- ఈఓ చంద్రశేఖర్ ఆజాద్


అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్

కొత్త క్యూ కాంప్లెక్స్


శివసదన్ సత్రం పార్కింగ్ స్థలంలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందీ పడకుండా స్వామివారిని దర్శించేందుకు వీలుగా కొత్త క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దీనిని వచ్చే కార్తిక మాసం నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. రత్నగిరిపై పలు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, రూ.800 వ్రత మండపాల మీద స్వామివారి ఆలయానికి దగ్గరలో.. నూతన రూ.2 వేల వ్రత మండపం వెనుక 150 అడుగుల పొడవు, 19 అడుగుల వెడల్పున విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించనున్నామని తెలిపారు. గతంలో స్వామివారి వంటశాల షెడ్డు నిర్మాణానికి టెండర్ పిలిచామని, అయితే దీని నిర్మాణానికి దాత ముందుకు వచ్చారని చెప్పారు. అందువలన వంటశాలకు కేటాయించిన మొత్తాన్ని విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తామని అన్నారు. సగం షెడ్డు నిర్మాణానికి ఈ మొత్తం సరిపోతుందని, మిగిలిన భాగం నిర్మాణానికి టెండర్ పిలుస్తామని వివరించారు. భక్తుల క్యూ షెడ్డు ఏసీ చేయిస్తామని, దీనివలన స్వామి వారి దర్శనం ఆలస్యమైనా భక్తులకు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ క్యూ షెడ్డులో భక్తులు కూర్చునేందుకు కూడా అక్కడక్కడ బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీరు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం సత్యదేవుని ఆలయానికి ఉత్తరం వైపు మండపం శ్లాబ్ ఎత్తు, ఆలయం వెలుపల శ్లాబ్ కన్నా చాలా ఎత్తుగా ఉందని, ఇది వాస్తు విరుద్ధమని ఈఓ తెలిపారు. అందువలన ఈ శ్లాబ్‌ను రెండడుగుల మేర తగ్గించి, ఆలయం చుట్టూ ఒకే ఎత్తులో శ్లాబ్ ఉండేలా చేస్తామని వివరించారు. ఓల్డ్ సీఆర్ఓ వెనుక 30 మీటర్ల వెడల్పు, 400 మీటర్ల పొడవున బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లతో పిలిచిన టెండర్‌కు కమిషనర్ ఆమోదం తెలిపారని చెప్పారు. త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణం ప్రారంభించి, కార్తికం నాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఇటీవల కూల్చివేసిన 30 వీఐపీ సత్రం వ్యర్థాలు మూడు రోజుల్లో తరలించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఈఓ ఆదేశించారు. ఈ స్థలంలో రూ.1.99 కోట్లతో 180 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పున షెడ్డు నిర్మాణానికి సికింద్రాబాద్‌కు చెందిన లారెల్స్ ల్యాబ్ ప్రతినిధులు ఇప్పటికే శంకుస్థాపన చేశారన్నారు. వ్యర్థాలను తొలగించి, స్థలం చదును చేసి, అప్పగించిన వెంటనే షెడ్డు నిర్మాణం ప్రారంభిస్తారని ఈఓ తెలిపారు. సత్యగిరిపై 138 గదులతో నిర్మిస్తున్న శివసదన్ సత్రం పార్కింగ్ స్థలంలో కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు చురుకుగా జరుగుతున్నాయని, మరో నాలుగు రోజుల్లో పూర్తవుతాయని ఈఓ ఆజాద్ తెలిపారు. ఇంజినీరింగ్ ఈఈ నరసింహారెడ్డి, డీఈ రాంబాబు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

భీమేశ్వరునికి రూ.15.62 లక్షల ఆదాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా రూ.15,62,881 ఆదాయం సమకూరింది. ఈఓ పితాని తారకేశ్వరరావు శనివారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ఈ ఏడాది జూన్ 15 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ ఈ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలరాజారామ్ ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగింది.

తమ్ముడి మృతి తట్టుకోలేక అక్క ఆత్మహత్య

కాకినాడ క్రైం: ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కొవ్వూరు రోడ్డుకు చెందిన గెద్దం భవానీ(33)కి కొన్నేళ్ల క్రితం ఆనంద్‌తో వివాహమైంది. వారికి ఓ కుమార్తె. భవానీ సోదరుడు మణికంఠ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. మూడు నెలల క్రితం తాను పని చేస్తున్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి అతడు మరణించాడు. అప్పటి నుంచీ తమ్ముడి మృతిని తట్టుకోలేక భవాని మనోవేదనకు గురైంది. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కాకినాడ క్రైం: నగరానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ప్రేజరుపేటకు చెందిన పొన్నాడ దుర్గారావు (48) పెయింటర్‌గా పని చేస్తూండేవాడు. పెద మార్కెట్‌లోని ఓ సందులో ఒంటిపై గాయాలతో శనివారం విగత జీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని పరిశీలించగా, అప్పటికే దుర్గారావు మృతి చెందాడు. దాడి కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానితులను విచారిస్తున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి.. భక్తజన వాహిని..

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. సుమారు 35 వేలు మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల వ్రతం ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.30,61,492 ఆదాయం సమకూరింది.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 4న శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం రాజవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ఈ నెల 4న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఈ విషయం తెలిపారు. రాజవరంలో యూనిట్ నిర్మించ తలపెట్టిన ప్రదేశాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యాన జిల్లాలో యూనిట్లు అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రూ.4.45 కోట్ల సిడ్బీ ఆర్థిక సహాయంతో ఈ యూనిట్ ఏర్పాటవుతుందని వివరించారు. కలెక్టర్ వెంట, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, ఆర్డీఓ చైత్ర వర్షిణి, కోరుకొండ తహసీల్దార్ పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

హర్షకుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆ పార్టీ రాష్ట్ర నేతలపై మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చేసిన ఆరోపణలను జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. అమలాపురంలోని దక్షిణామూర్తి వీధిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా సమావేశం హర్షకుమార్ తీరుపై ధ్వజమెత్తింది. తక్షణమే ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరంలో హర్షకుమార్.. మీడియాతో చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడి, ఆ పార్టీ కోసం పాకులాడుతున్నట్లు కనిపించిందని ప్రభాకరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి వంటి వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం హర్షకుమార్‌కు తగదని సమావేశం స్పష్టం చేసింది. హర్షకుమార్‌కు ఎప్పుడూ నెగెటివ్ ఆలోచనలు తప్ప పాజిటివ్ ఆలోచనలు ఉండవని విమర్శించారు. వేరే పార్టీలోకి వెళ్లాలంటే జిల్లా పార్టీలో ఎవ్వరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ పరీక్షల్లో రమ్యశ్రీకి 18వ ర్యాంకు


రమ్యశ్రీని అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సీఎంఏ–2023 పరీక్షల్లో అమలాపురానికి చెందిన అడ్డగర్ల రమ్యశ్రీ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించింది. దేశ వ్యాప్తంగా వేలాదిగా విద్యార్థులు హాజరైన ఈ పరీక్షల్లో అతి తక్కువ మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో బీకాం చదివిన రమ్యశ్రీ గుంటూరులో సీఎంఏ శిక్షణ పొందింది. జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన రమ్యశ్రీని గుంటూరు శ్రీమేధా అకాడమీ డైరెక్టర్ కేఎస్‌టీ కిషోర్ శనివారం అభినందించారు. రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. రమ్యశ్రీని ఎస్‌కేబీఆర్ కళాశాల అధ్యాపకులతో పాటు వివిధ విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు కూడా అభినందించారు.

మహిళ మృతదేహం లభ్యం

నల్లజర్ల: భర్తతో గొడవ పడి అనంతపల్లి వద్ద పోలవరం కాలువలో దూకిన కస్తూరి (24) మృతదేహం శనివారం శింగరాజుపాలెం శివారులో లభ్యమైందని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఆమె ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ దళాలతో పాటు గజ ఈతగాళ్లు పోలవరం కాలువలో గాలించారన్నారు. కస్తూరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించామని చెప్పారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.